# కోర్కె మార్పు

"కష్టం సుఖం అంటే యేమిటో తెలియని పసి తనాన్ని వివాహం చేశారునాకు....నాకు యీడురాక ముందే ఆయన యేళ్లుపూర్తిఅయి పరలోకానికి వెళ్లాడు..............."

తరువాత ఆమె సాహసించింది. కాని—

శ్రీ మల్లాది నరశింహాశాస్త్రి

నా ఆఖరి ప్రయాణానికి అంతా సిద్ధం చేసుకున్నాను. నాన్న అమ్మ అన్నయ్యని తలుచుకొని ఏడ్చాను....కాని ఏం లాభం....వాళ్ళకీ నాకూ రుణం తీరిపో యింది. నా చావుకు కొంతన్నా జాలిపడే వాళ్ళు ఎవరన్నా వున్నారా అని ఆలోచించు కున్నాను. ఈ విశాల ప్రపంచంలో నువ్వు ఒక్కదానివిమాత్రం జ్ఞప్తికి వచ్చావు. పాపం అన్నయ్యకూడా అటువంటివాడేననుకో.... కాని వాడుమాత్రం ఏం చేస్తాడు, నాన్న యింతవేస్తే తింటాడు....కాని స్వతంత్ర జీవి కాదుగదా। నిజంగాకూడా నా జీవితాంధ కారంలోకి కొంత వెలుగుని ప్రవేశపెడతా మనుకున్నాడు గాని అది వాడి శక్తికి అతీ తమై పోయింది.

నా చివరి గడియలివి. నా జీవితంలో యిటువంటి చలిపిడుగు నా నెత్తిన పడుతుం దని నేను రెండు మూడు రోజుల క్రితం వరకు తలవనన్నా తలవలేదు....ఏక్షణాని కేం జరుగుతుందో ఎవరికెరుక. నా అం త్యాన్ని గురించి నిజానికీ నే నెవరికీ రాయ దల్చుకోలేదు....నేను పడిన బాధతోబాటు నిన్నూ....మా అన్నయ్యవంటి సహృదయు లనూ బాధపెట్టడం సుతాలామూ నాకు యిష్టంలేదు. కాని నాన్నవంటి వాళ్ళకి, ఈ సంఘానికి ఈవార్త తెలియగానే పీడ వది లింది అని అనుకుంటారనే ఈ లేఖ నేను రాయడం. నా సాధక బాధకాలను గురించి ఆలోచన లేనివాళ్ళు ఎన్ని మాటలు నన్ను అనుకుంటే నేం.........

నేను లేచిపోయాననే సంగతేగాని ప్రపంచానికి నేను ఎందుకు అట్లా చేశాను అన్న సంగతే వాళ్ళకి అవసరం లేదు. నాకు అటువంటి వుద్దేశ్యమే వుండవచ్చు. గాని నువ్వు కొంచెం లోతుగా ఆలోచించగల మనిషివి....పాపం నాకు మాత్రం ఏం తెలుసు। నువ్వు అత్తవారింటికి వెళ్ళిన మూ డేళ్ళబట్టి మనం కలుసుకునేందుకన్నా తటస్థ పడలేదు. నీకుమాత్రం యింతలోతుగా ఈ విషయం ఎట్లాతెలుస్తుంది....ఇక నాకధను తెల్పుతున్నాను....జాగ్రత్తగా విసువులేకుండా ఈ దీనురాలిని మన్నించి చదువుతానను కుంటాను.

కష్టం, సుఖం అంటే ఏమిటో తెలి యనిపసితనాన్న వివాహం చేశారు నాకు. నేను సుఖపడాలని మావాళ్ళు నాకుచేసిన వివాహంకాదది. డబ్బుకోసం। నాన్నకి పనేముంది డబ్బు సంపాదించటమే ఆయన ప్రధానోద్దేశ్యం. వడ్డీలమీద వడ్డీలుకట్టి ఎంత మంది బీదవాళ్ళవుసురో పడుకుండూ ఆయ నకు ఇనప్పెట్టెలు నింపటమే ప్రధానం కాని యితరుల సుఖాలతో ఇతరుల కష్ఠాలతో ఆయనకేం సంబంధంలేదు....ఎవరికివారే యమునాతీరే అనేరకం. నా వివాహం కూడా డబ్బు ఆశతోనే చేశాడని మీ అంద రికీ తెలిసిన విషయమేకదా. పెళ్ళికొడుకుని పెళ్ళిచూపులకివచ్చినప్పుడు నువ్వు చూసే వుంటావు.........ఈదేశంలో పెళ్ళికొడుకుకు పెళ్ళికూతురు నచ్చటం ప్రధానం కాని పెళ్ళి కూతురికి పెళ్ళికొడుకు నచ్చటం నచ్చక పోడాలతో ప్రమేయంలేదు....చివరికిఏడ్పులు మొత్తుకోళ్ళతో వివాహం పూర్తి అయ్యింది....అన్నయ్య నూతిలోపడిచస్తాను అని పర్రిగెత్తాడు....కాని ఆ వెర్రిబాగులాడి చేష్టలకు 'ఓహో' అనేవాళ్ళు ఎవరు। నాకు ఈడురాకముందే ఆయనయేళ్ళు పూర్తిఅయి, పరలోకానివెళ్ళాడు....నాన్న కోరిక ఫలించి కొంత పొలం కలిసివచ్చింది.

ఇక అన్నయ్యపెళ్ళి: 'నాకు సంసారాన్ని పోషించుకునేశక్తిలేదు. నాకు కూడు పడేం

శేందుకే రాచిరంపాన్న పెడుతూన్న వాళ్ళు, నా పెళ్ళాంబిడ్డలని మీరేం సుఖపెడతారు, నాకు వివాహంవద్దు మొర్రోమీకు ఆ 'జన్మాంతరం కృతజ్ఞుణ్ణిగావుంటాను వొద్దో' అన్నాడు....వాడి యిష్ఠమేనా సాగేది....కామరాజుగారి పెద్దమ్మాయినిచ్చారు తెలుసుగా........ పాపం వుత్త అమాయకురాలు........అన్నయ్యకి ఆ అమ్మాయికిచ్చి నాన్న పెండ్లి చెయ్యటంలో వుద్దేశ్యమేమిటో తెలుసునా? వాళ్ళకి యిక పిల్లలు లేరుగా, తర్వాత లక్ష రూపాయల ఆస్తి మనదే ననుకున్నాడు....తీరా పెళ్ళి అయిన సంవత్సరానికి తలవనితలంపుగా వాళ్ళకు మొగపిల్లాడు పుట్టాడు....ఇక నాన్న చేష్ఠలు ఏం చెప్పను! ఆరోజున ఆయన చూపిన మర్కట చేష్టలు నేను వర్ణించి రాయలేను.

పాపం వొదిన కాపరానికి వచ్చిం తర్వాత పుట్టింటికన్నా పంపకుండా అడ్డమైన చాకిరీ చేయించేవారు....పాపం చివరికి పురిటిలోనే పోయిందిగా....ఆమే నేనూ ఒకళ్ళ బాధలు ఒకళ్ళతో చెప్పుకుని కుమిలిపోయేవాళ్లం.

తర్వాత నాన్న మళ్ళా అన్నయ్యకి సంబంధాలు తీసుకొని రావటం ప్రారంభించాడు. ఒకరోజున వాళ్ళ పోట్లాట ముదిరిపోయింది అన్నయ్యంటాడూ నేనే నీకూతుర్ననుకో దానికి మొగుడుపోతే మళ్ళిపెళ్ళి చేస్తావా....నన్నూ అట్లాగే అనుకో" అన్నాడు ప్రాణాలు అరి చేతులో నుంచుకొని. దానికి తగినట్టు ఆరోజు నాన్న పిల్లవాడి తండ్రి అన్నా తలచకుండా ప్రక్కనున్న కర్ర తీసుకొని కొట్టాడు....పాపం....అన్నయ్యకి ఎంత నమ్రత. అసలు వొదినతోనే సగం ప్రాణం పోయింది వాడిది....ఇక అమ్మఅంటావా శుద్ధ జడురాలు నాన్న 'తందానా' అంటే తాను 'తానా' అంటుంది.

నాకు యిరవై సంవత్సరాలు పైబడ్డాయి....ప్రపంచంలో జరిగే మంచీ చెడ్డా, నీతీ నియమం తెలుసుకోడానికి అప్పుడే నాకు కనువిప్పయింది. నా జీవితమంతా అడవి కాచిన వెన్నెలకదా అని తెలుసుకొని దుఃఖించాను. నా జీవితాన్ని గురించి నాకు కావలసిన సుఖాన్ని గురించి ఆలోచించేవాళ్ళు ఏవరున్నారు. అందరికిమల్లే నాకూ సుఖం కావాలి....నేనుమాత్రం మనిషిని కానా....నువ్వు నీ మొగుడితో సుఖంగా కాపరం చేస్తున్నావు....నాకూ అటువంటి కోర్కె స్వభావసిద్ధంగా వుంటుందా లేదా! కాని ఆడవాళ్ళకి సుఖాన్నపేక్షించే అధికారం....ముఖ్యంగా నాబోటివాళ్లకు....అసలుఆమాటే అనకూడదు లే....అన్నయ్య ఒకసారి టౌను హాలునుండి విరేశలింగంగారి పుస్తకాలు తెచ్చి యిచ్చాడు; వాటిని ఆమూలాగ్రంగా జాగర్తగా చదివాను...మన శాస్త్రాదులుకూడా నాబోటివాళ్ళకు మళ్లీ పెళ్ళిని గురించి హక్కులున్నట్లు చూపించాయి....ఇక నాకు ఏమీ తెలియని యీ సంఘానికి నేను జడియనక్కరలే దనుకున్నాను.

నా ప్రేమంతా ఒక్కడిమీద నిలిపాను. ప్రకాశరావని మా అన్నయ్య స్నేహితుడు. మద్రాసులో ఏదో పత్రికాకార్యాలయంలో పనట; ఒకరోజున మా యింటికి అన్నయ్య కోసం చూసేందుకు వచ్చాడు. ఇంట్లో ఎవ్వరూ లేరు. నాన్నా అమ్మా పిన్నిగారి కుమార్తె పెండ్లికి వెళ్ళారు. అన్నయ్యా మధ్యాహ్నమనగా ఎక్కడికో వుద్యోగం ఆశ్రయించేందుకు వెళ్ళాడు

ఆయన రావటం "అమ్మా, ప్రకాశరావున్నాడా? ఆతను మీకేమవుతాడు" అని అడిగాడు.

నేనూ, 'అతడు మా అన్నయ్య. బయటికి వెళ్లాడ'నీ చెప్పాను.

తను సెలవపెట్టి ప్రత్యేకం అన్నయ్యని చూచేందుకు ఈవూరు వచ్చాననీ తనపక్కచుట్టా అవీ ఎక్కడ పెట్టుకోమంటారో చెప్పవలసిందనీ అడిగాడు. లోపల స్థలం చూపించి 'దాహం కావాలా' అని అడిగి యిచ్చాను.

ఇద్దరం ఈ విషయం ఆవిషయం మాట్లాడుకున్నాం....నేనిదివరకు ఏ పరాయి మగవాడితోనూ యింత చనువుగా మాట్లాడలేదు....అసలు మాట్లాడి ఎరుగుతేగదా చనువు సంగతి! మధ్యలో తనకి యింకా వివాహం కాలేదనీ—తనకు నచ్చిన పిల్ల కనబడితే చేసుకొంటాననీ చెప్పాడు.

ఇంతలోకే అన్నయ్యవచ్చాడు. పిచ్చాపాటీ మాట్లాడుకొన్నారు. వాళ్ళమాటలు చూస్తే యింతప్రాణస్నేహితులా అనిపించింది.

ప్రకాశరావు నాల్గురోజులువున్నాడు. అమ్మా నాన్నా లేకపోవటంవల్ల మేం అన్యోన్యంగా మాట్లాడుకోవటానికి సావకాశం లభించింది. ఈనాల్గురోజుల్లోను మాయిద్దరి ప్రేమా రూఢిఅయిపోయింది. అన్నయ్యకి కూడా యీ సంగతి ఏమీతెలియదు. మాటల్లోను చేష్ఠల్లోనూ ప్రకాశరావు ఎట్లా కనిపించాడో తెలుసునా? నాకోసం ప్రాణం యిస్తానన్నట్లుగా కన్పించాడు.—

మావాళ్ళసంగతి అతడికి తెలియదుగా, 'మీ అమ్మా నాన్నల అంగీకారంతో వివాహం చేసుకుందాం' అన్నాడు. నేను వాళ్ళు ఒప్పుకోరనీ ఆఖరికి ఈ విషయం అన్నయ్యకి కూడా తెలియనీయవద్దనీ చెప్పాను. అన్నయ్యకి తెలుస్తే యిబ్బంది లేదుగాని, అతడు నావిషయమై బాధపడితే నేనోర్చలేను.

మేమిద్దరం కలసి మద్రాసువెళ్ళిపోయేటట్లూ, అక్కడ వివాహం చేసుకొనేటట్లూ ఏర్పాటుచేసుకున్నాం. అమ్మా నాన్నావచ్చింతర్వాతే మేమిద్దరం వెళ్ళిపోయేందుకు యేర్పర్చుకున్నాం; తెలుసునా?..ఎందుకంటే

అన్నయ్య వున్నప్పుడే వెళ్ళిపోతిమా నేను ఎవడితోనో అన్నయ్య యిష్టంమీద లేచి పోయాననుకుంటారేమోనని నాభయం—— అందుచేత వాళ్లు వొచ్చింతర్వాత వెళ్ళితే కష్టంవుండదు.

ప్రకాశరావు వూరువెళ్లిపోయి ఫలాని రోజు రాత్రి చింతచెట్టువద్దకు ఫలాని టైములో వస్తానన్నాడు. సరేనన్నాను. ప్రకాశరావు నన్నూ అన్నయ్యనీ వీడ్కొని వెళ్ళిపోయాడు....పాపం అన్నయ్యకి మా వూహలేమీ తెలియవు.

అమ్మా నాన్నా వచ్చివేశారు. పదిరోజులు గడిచాయి. అనగా ప్రకాశరావు వస్తాన్న రోజన్నమాట. రాత్రి అంతా మాటుమణింగింతర్వాత చడీచప్పుడూ కాకుండా తలుపుతీసుకొని చింతచెట్టువద్దకు వెళ్లాను. ప్రకాశం నాకోసం ఎదురుచూస్తూ కారులో కూర్చునివున్నాడు. కారులో కెక్కి నా జీవితాంధకారంలోకి ప్రకాశకిరణాలు వచ్చాయికదా అనుకున్నాను.

మద్రాసు చేరాము. ఆ మహాపట్టణాన్ని చూస్తే ఏదో కొత్తప్రపంచంలో వున్నట్టుగా తోచింది. బీచిమీదుగా వాళ్లయింటికి తీసి కెళ్లాడు. ఒకసందుమొదలుగావున్నయింట్లో అతనిబస. హోటల్నుంచి భోజనం తెప్పించుకుని తిని బజారువెళ్లాము. నాకు కావలసిన చీరలూ అవీ కొన్నాడు.

అన్నట్లు చెప్పటం మరిచాను....ప్రకాశానికి తల్లిదండ్రులు చిన్నప్పుడే పోయారుట. మేనమామ పెంచి పెద్దవాణ్ణిచేసి ఆస్థి వొప్పగించి మరణించాడు. వివాహానికి అంతరాయం యేమీలేదు. కాని నాన్నవిషయం భయంవేసింది. కాని నెలరోజులు చూసిం తర్వాత ఆ భయంపోయింది. కులాసాగా గడుస్తున్నాయి రోజులు. అన్నయ్యదగ్గర నుంచి వుత్తరంవచ్చింది. "మీకు భగవంతుడు మేలుకూర్చుగాక" అని వ్రాశాడు.

కాలచక్రం గిర్రున తిరిగిపోతోంది. ప్రకాశరావుతో వివాహ విషయం చాలాసార్లు ఎత్తాను. అతడు "మన ప్రేమబంధమే చాలు ఇంకా వివాహంయేమిటిలే, అయినా తొందర ఎందుకు" అని రోజులు గడపటం ప్రారంభించాడు.

నాకు నెలతప్పినట్టు అనుమానమేసింది. ప్రకాశరావుతో "వివాహం చేసుకొంటేగాని చుట్టుపక్కలవాళ్లగోల నేను భరించలేను:లేవ తీసుకొచ్చి దేన్నో యింట్లో పెట్టుకున్నాడని ఈసడిస్తున్నారు. వివాహమనేది ప్రజల కళ్లబడందే సంఘం మనల్ని నీచులుగా చూస్తుంది" అన్నాను. "వేదాంతం కట్టిపెట్టమని" ఛర్రున లేచి వెళ్ళిపోయాడు.

ఒకరోజున ప్రకాశరావు యింట్లో లేని సమయంలో ఒక కుర్రవాడేదో కాగితం తెచ్చి అతని కివ్వవలసిందని యిచ్చి వెళ్లాడు. తీసి చూచాను:

"రెండురోజులనుంచీ దర్శనమే లేదు. మధ్యాన్నం టీకి మా యింటికి రావాలి.... రాకపోతే సాయంత్రం మీ యింటికి వచ్చి లాక్కెడతాను"

ప్రియురాలు
మాలతి

ప్రపంచమంతా గిర్రున తిరుగుతున్నట్లు కన్పడింది. నా జీవితాంధకారంలోకి ప్రకాశకిరణాలు జొరపడతాయనుకున్నాను గాని మహిత గాఢాంధకారం యేర్పడుతుందని కలనన్నా తలచలేదు.

ప్రకాశరావుకి ఆకాగితం నే నియ్యలేదు. మూడింటికి ఆఫీసుకి నామీద రుసరుసలాడుడూ వెళ్ళిపోయాడు. అయిదింటికి మాలతీదేవి వచ్చింది, తలుపు తట్టింది. నన్ను చూడగానే 'ప్రకాశరావు కేమవుతార'ని అడిగింది. ఏం చెప్పను: ఏం కానని చెప్పాను. వెళ్ళిపోయింది.

సాయంత్రం చీకటి పడ్డంతోటే యింటికి వచ్చాడు.

"నన్ను ద్రోహం చేస్తావా దుర్మార్గుడా నన్ను పెళ్ళిం చేసుకొంటానని నమ్మించి గొంతుకు కోస్తావా" అన్నాను.

"లేచి వచ్చిందానిని....నేనా పెళ్ళిం చేసుకోవటం"

చలి పిడుగుపడింది. ఆశ నిరాశ అయింది. నేను ఇక్కడవుండటం దేనికి ఇంక ప్రపంచం ఏమిటి....ఛీ వెధవ సంఘం....పాపిష్ఠి మనుష్యులు: ఇంత ద్రోహమా?

నా నోటికి వచ్చినట్లు ఇవీ....అవీ అనేశాను. రెండు తన్ని 'లేచి వచ్చిందానికి నీకు నీతేమిటి లేచిపో' అని గెంటేశాడు

గాఢాంధకారం....ప్రొద్దుటినించీ నిర్మలంగావున్నఆకాశమంతా కారుమబ్బులతో మూసుకొని పోయింది. కాళ్ళు మాత్రం సముద్రతపుటొడ్డుకు దారి తీస్తున్నాయి మనస్సు మాత్రం చాలా నేపై చచ్చి పోయింది. ప్రాణం అనేదేగా యీ బొందిలో వుంది....ఇది కాస్తాపోతే....అసలు నేను కన్పించకపోతే ఎవ్వరికీ కష్టం వుండదు.

దారిలో నేనెరుగున్న వాళ్లయిల్లు వుంటే నువ్వు జ్ఞాపకం వచ్చి యిదంతా అక్కడ కూర్చొని వ్రాస్తున్నాను అన్నయ్యకి తర్వాత ఈ వుత్తరంపంపు....బహుశః వాడు బ్రతకడు....

చిన్నప్పుడు మనం యిద్దరం యేమీ తె యని యీడులో ఎంత కులాసాగా ఆడుకో వాళ్లం....మనకి కళ్లమీద ఒకళ్లకి ఎం ప్రేమ....లాభంలేదు అవన్నీ జ్ఞాపకం చేసకొంటూ కూర్చుంటే,——ఈ వెధవకుళ్లుబోతు ప్రపంచంలో యింకా బ్రతకాలని మనస్సు పుట్టుతుంది. క్షమించు....వుంటాను. ఇక నీవు నేనూ చూపులకి కలుసుకోలేము.

సీ——